సాక్షి
సంగారెడ్డి

బుధవారం : 6 : సెప్టెంబర్ : 2023

దంచికొట్టిన వాన



నారాయణఖేడ్: ర్యాకల్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొట్టాయి. రోజంతా వానలు కురిశాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. జలాశయాలన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. పలు చోట్ల పంటలు నీటమునిగాయి. జిల్లాలోని గుమ్మడిదలలో 3.5 సె.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. రామచంద్రాపురంలో 2.9, జిన్నారంలో 2.8, అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్‌లో 2.4 సెం.మీల వర్షపాతం రికార్డుఅయ్యింది. పటాన్‌చెరువులో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నెల రోజుల తర్వాత వానలు పడుతుండటంతో పంటలకు జీవం పోశాయి. – సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో సోమవారం అర్ధ రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. పలు ఇళ్లు పాక్షికంగా కూలాయి. చెరువులు, కుంటల్లోకి గణనీయంగా నీరు చేరి అలుగులు పారాయి. కాగా వర్షపాతం.. సిర్గాపూర్‌లో 85.2 మి.మీ, మనూరులో 71.6, నిజాంపేట్‌లో 62.5, ఖేడ్‌లో 60.4, నాగల్‌గిద్దలో 58.2, కంగ్టిలో 52.2, కల్హేర్‌లో 43.6 మి.మీగా నమోదైంది. అయితే మండలంలోని ర్యాకల్ చావిడి కూలిపోయింది. పంచగామ, హంగిర్గా(బి) గ్రామాల్లో రెండు చొప్పున ఇళ్లు పాక్షికంగా కూలినట్లు తహసీల్దార్ దేవిదాస్ తెలిపారు. గంగాపూర్‌లోని ర్యాకల్ రిజర్వాయర్ మరోసారి అలుగు పారింది. తూము షట్టర్ పాడవ్వడంతో మళ్లీ భారీ వర్షం కురిస్తే కట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉండటంతో రైతులు, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె అధికారులకు విషయాన్ని వివరించారు. దీంతో తహసీల్దార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్ఐ శ్యాంరావు, సర్పంచ్ శ్రీనివాస్ కలిసి రిజర్వాయర్‌ను సందర్శించారు. పరిస్థితిని నీటి పారుదలశాఖ అధికారులకు ఫోన్ ద్వారా వివరించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నీట మునిగిన పత్తి


సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కురుస్తున్న వర్షాలకు నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో 100 ఎకరాల్లో పత్తి పంటలు నీట మునిగాయని మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసినా అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే నిర్మాణాన్ని చేపట్టాలని మంగళవారం డిమాండ్ చేశారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ కృష్ణను వివరణ కోరేందుకు ఫోన్లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

దిగువకు తరలుతున్న నారింజ ప్రాజెక్టు వరద

జహీరాబాద్: కురుస్తున్న వర్షాలతో మండలంలోని కొత్తూర్(బి)లో గల నారింజ ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. మంగళవారం ప్రాజెక్టులోకి 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు గుర్తించారు. ప్రాజెక్టు షట్టర్లపై నుంచి 9 ఇంచుల మేర నీరు దిగువన ఉన్న కర్ణాటక ప్రాంతానికి తరలుతోంది. ప్రాజెక్టును నీటి పారుదల శాఖ ఈఈ విజయ్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. ఈ వర్షాల వల్ల పట్టణంలోని డ్రీమ్‌వ్యాలీ, వసంత్‌విహార్ కాలనీలు జలమయం అయ్యాయి. దీంతో దిగువ ప్రాంతానికి వరద సాఫీగా వెళ్లేందుకు వీలుగా ఆర్డీఓ వెంకారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డిల ఆధ్వర్యంలో తగిన చర్యలు చేపట్టారు. కాలనీల దిగువన ఉన్న అల్గోల్ వెళ్లే రహదారిని తాత్కాలికంగా మూసివేశారు. వాగుపై సైడ్ వాల్స్ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉన్నందున వాహన రాక పోకలను నియంత్రించి, ఇతర మార్గం గుండా అనుమతించారు.



సదాశివపేట రూరల్‌లో నీట మునిగిన పత్తి పంట



జహీరాబాద్: నారింజ ప్రాజెక్టు నుంచి దిగువకు చేరుతున్న వరద



హత్నూర : సిరిపురంలో అలుగు పారుతున్న భీషన్ చెరువు

న్యూస్‌రీల్

కుంటలు, చెరువుల్లో కలుషిత నీరు

- నిబంధనలను పట్టించుకోని రసాయన పరిశ్రమలు



బొల్లారంలో కాలుష్య జలాలతో రంగుమారిన భూమి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామికవాడల్లోని రసాయన పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘించి కలుషిత జలాలను యథేచ్ఛ గా బయటకు వదులుతున్నాయి. దీంతో సమీపంలోని కుంటలు, చెరువులు కలుషితంగా మారుతున్నాయి. ఇప్పటికైనా యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే మాణిక్‌రావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జహీరాబాద్: విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఎక్కడైనా కరెంట్ స్తంభాలకు షాక్ వచ్చే అవకాశం ఉన్నందున తగిన చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు సూచించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ ప్రవీణ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ రంగ సమస్యలపై సమీక్ష జరిపారు. ఎక్కడైనా స్తంభాలు వంగిపోయి ఉంటే, తీగలు వేలాడితే వెంటనే సరిచేయించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం


సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రంలో బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అయితే రేషన్‌కార్డుతోపాటు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్లు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు సమర్పించాలని తెలిపారు. సెప్టెంబర్ 13 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యాలుంటాయని తెలిపారు.

పీహెచ్‌సీలకు సోలార్ పరికరాలు

సాక్షి, సిటీబ్యూరో: ఇంటెలిజెంట్ సోలార్ ట్రాకర్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అందించే ప్రముఖ సంస్థ నెక్స్‌ట్రాకర్, సమర్థనమ్ ట్రస్ట్ ఫర్ ది డిసేబుల్డ్‌తో కలిసి పలు ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలకు ఉచితంగా సోలార్ పరికరాలు అందజేసింది. ఈ విషయాన్ని సంస్థ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ రాజీవ్ కశ్యప్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్, ఆత్మకూర్‌లోని రెండు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లో అత్యాధునిక సోలార్ ఫొటోవోల్టాయిక్ (పీవీ)ని ఇన్‌స్టాల్ చేశామని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న 50 వేల మందికి అధిక-నాణ్యతతో కూడిన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

పొలాల్లో నీటిని తొలగించుకోవాలి

- జోగిపేట ఏడీఏ అరుణ



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ అరుణ

పుల్‌కల్(అందోల్): రెండు రోజులుగా భారీ వర్షాలు కురియడం వల్ల పత్తి, ఆరుతడి పంట పొలాల్లో నిలిచిన నీరును తొలగింపజేసుకోవాలని జోగిపేట డివిజన్ వ్యవసాయాధికారి అరుణ తెలిపారు. మంగళవారం మండలపరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయాధికారి చైతన్యతో కలిసి పంటలను పరిశీలించారు. వానలు తగ్గుముఖం పట్టిన తర్వాత కాంప్లెక్స్ ఎరువులను వాడాలని సూచించారు.

కేసీఆర్ నిర్ణయంలో మార్పుండదు

- బీఆర్ఎస్ హ్యాట్రిక్ గెలుపులో భాగస్వామ్యం కావాలి
- జహీరాబాద్ శ్రేణులకు హరీశ్‌రావు దిశానిర్దేశం
- హైదరాబాద్‌లో నియోజకవర్గ కీలక నేతలతో భేటీ



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జహీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు బరిలో ఉంటారని, సీఎం కేసీఆర్ నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండబోదని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీష్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్యనేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధినేత నిర్ణయించిన అభ్యర్థి కోసం పార్టీ శ్రేణులంతా కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సీఎం హ్యాట్రిక్ విజయంలో ఈ నియోజకవర్గ కూడా భాగస్వామ్యం కావాలని, అభివృద్ధిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడ బీఆర్ఎస్‌ను గెలిపించుకుని కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. మనస్పర్థలుంటే పక్కన బెట్టి మాణిక్‌రావును మూడోసారి కూడా భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని దిశానిర్దేశం చేశారు. పని చేసే ప్రతి కార్యకర్తకు, నాయకులకు వచ్చే రోజుల్లో తగినన్ని అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటికే పార్టీ ముఖ్య నాయకులు, ప్రధాన కార్యకర్తలకు పార్టీ గుర్తింపు ఇచ్చి పదవులు ఇచ్చి గౌరవించిందన్నారు. మిగిలిన వారికి కూడా ఇస్తుందని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్, ఇటీవల పార్టీలో చేరిన సీనియర్ నాయకులు ఏర్పుల నరోత్తం, అన్ని మండలాల కీలక నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు





మంత్రి సబితారెడ్డి నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న మొగడం పల్లి మండలం అసంద్‌గంజ్ జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయుడు జగదీశ్వరయ్య, కొండాపూర్ మండలం సైదాపూర్ అప్పర్ ప్రైమరీ ఉపాధ్యాయుడు పూర్ణ కృష్ణ

కొండాపూర్(సంగారెడ్డి): హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతులమీదుగా సంగారెడ్డిలోని తారా కళాశాల రాష్ట్ర స్థాయిలో న్యాక్ ఎ+ గ్రేడ్ సాధించినందుకు గానూ.. అత్యుత్తమ కళాశాలగా, రత్న ప్రసాద్‌కు రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డులు అందుకున్నారు. రసాయన శాస్త్ర అధ్యాపకుడు అభిజిత్ రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ అధ్యాపకుడిగా, కొండపూర్ మండలంలోని సైదాపూర్ అప్పర్‌ప్రైమరీకి చెందిన డాక్టర్ పూర్ణ కృష్ణ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

గురువులు మరో బ్రహ్మలు

కొండాపూర్(సంగారెడ్డి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే మరో బ్రహ్మలని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానంతోపాటు పురస్కారాలను ఆమె, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ 120 మందికి ప్రదానం చేశారు.



కొండాపూర్ : సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రశంసా పత్రాలతో ఉపాధ్యాయులు

పరస్పర సహకారంతో నేరాలకు చెక్

- రెండు రాష్ట్రాల సరిహద్దు పోలీస్ అధికారులు



సమావేశమైన సరిహద్దు పోలీసు స్టేషన్ల అధికారులు

జహీరాబాద్: పరస్పర సహకారంతో నేరాలను అరికడదామని పోలీస్ అధికారులు అన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని సరిహద్దు అధికారులు మంగళవారం జహీరాబాద్‌లోని మహీంద్ర అండ్ మహీంద్ర గెస్ట్ హౌస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వచ్చే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూద్దామన్నారు. నేరాలకు పాల్పడేవారు పక్క రాష్ట్రాల్లో తలదాచుకునే అవకాశం ఉందన్నారు. అలాంటి వాటికి తావివ్వకుండా తగిన చర్యలు చేపట్టాలని చర్చించారు. అక్రమంగా మద్యం ప్రవేశించకుండా సహకరించుకోవాలని కర్ణాటక పోలీసులను కోరారు. గట్టి నిఘా ద్వారా నేరాలను పూర్తిగా అదుపుచేసేందుకు సాధ్య పడుతుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ పి.అశోక్, డీఎస్పీ వి.రఘు, కర్ణాటకలోని హుమ్నాబాద్ ఏఎస్పీ శివాన్షురాజ్‌పుత్, జహీరాబాద్ సీఐలు బి.రాజు, వెంకటేష్, ఫారెస్ట్ అధికారి రాధికారెడ్డి, చించోళి, బీదర్ రూరల్, భీమల్‌ఖేడ్ సీఐలు, ఎస్ఐలు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

నారాయణఖేడ్: త్వరలో జరిగే ఎన్నికల దృష్ట్యా రెండు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని, అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. పట్టణంలో మంగళవారం కర్ణాటక సరిహద్దు డివిజన్లతోపాటు ఖేడ్ సబ్‌డివిజన్ పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. జంగి తండా, చిల్లర్గి, చింతాకీల్లో కర్ణాటక వారు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణలోని మోర్గి, కరస్‌గుత్తి సమీపంలోని కర్ణాటక సరిహద్దు, దెగుల్‌వాడీలో తెలంగాణ తరపున వీటిని ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో కర్ణాటకలోని బాల్కి డివిజన్ డీఎస్పీ శివానంద్ పవాడ్‌శెట్టి, ఔరాద్ సీఐ రఘువీర్‌సింగ్ ఠాకూర్, ఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత

జహీరాబాద్: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ లెవల్ బాధ్యులకు శిక్షణ ఇచ్చారు. మంగళవారం పట్టణ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అసెంబ్లీ కోఆర్డినేటర్ కె.నర్సింహారెడ్డి, 16 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి శ్రీకాంత్.. 32 మందికి శిక్షణ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలనే దానిపై అవగాహన కల్పించారు. ఒక్కో బాధ్యుడికి 10 బూత్‌లకు ఇన్‌చార్జిగా నియమించారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షుడు ఎస్.గిరిధర్‌రెడ్డి, నాయకులు గుండ్‌రెడ్డి, పి.నర్సింహారెడ్డి, భీమయ్య, కండెం నర్సింహులు, జమీల్, మైనొద్దీన్, వి.రాములు, అక్బర్, గోపాల్ పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేసే వరకూ దీక్ష



దీక్ష చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్, సీఆర్పీ, ఎంఎస్ కోఆర్డినేటర్, ఐఆర్పీ, కంప్యూటర్ ఆపరేటర్స్, మెసెంజర్, పీటీఐలను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. ఏళ్లుగా పని చేస్తున్నా.. తగిన వేతనం, ఉద్యోగ భద్రత లేక మనోవేదనకు గురవుతన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులరైజ్ చేసేవరకు రిలే దీక్షలు కొనసాగిస్తామన్నారు. వీరికి ఎస్టీయూ, యూటీఎఫ్, టీపీయూఎస్, ఎస్జీటీయూ సంఘాల బాధ్యులు మద్దతు తెలిపారు.

లక్ష్యానికి మించి రుణాలు

- రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా ఫస్ట్
- జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మల్లేశం

వట్‌పల్లి(అందోల్): డ్వాక్రా గ్రూపులకు లక్ష్యానికి మించి బ్యాంకు రుణాలు అందజేయడం ద్వారా రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మల్లేశం అన్నారు. సోమవారం రుణాలు అందజేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు. మంగళవారం వట్‌పల్లిలోని మహిళ సమాఖ్య కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి జిల్లాలో రూ.393 కోట్లు బ్యాంక్ రుణాలను సంఘాలకు ఇవ్వాల్సి ఉండగా ఇవాల్టి వరకు రూ.400 కోట్లు అందజేశామని స్పష్టం చేశారు. ఈనెలాఖరు వరకు మరో రూ.100 కోట్లు అందజేస్తామన్నారు. అదే స్థాయిలో వందశాతం రుణాల రికవరి ఉండాలని ఏపీఎం, సీసీలకు సూచించారు. బ్యాంక్ రుణాలపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి అర్హులకు వీటిని అందజేయాలన్నారు. ఇచ్చినవి సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, సీసీలు జనార్దన్, ఈశ్వరయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశం

ప్రజలను అప్రమత్తం చేయాలి

అధికారులకు కలెక్టర్ శరత్ ఆదేశం

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని కలెక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తు న్న నేపథ్యంలో మంత్రి హరీశ్ రావు ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎస్పీ రమణకుమార్‌తో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలు తదితర విషయాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా వారిని సంరక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాటు చేసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఇరిగేషన్ ట్యాంక్‌లన్నింటినీ ఎప్పటికప్పుడూ క్షేత్ర స్థాయిలో ఉండి పరిశీలించాలన్నారు. చెరువులు, కుంటలు, రోడ్లు, కల్వర్ట్స్, కాజ్వేస్ అలుగు పారుతున్న వాటిని మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆర్ అండ్‌బీ అధికారులు గ్రామపంచాయతీ ప్రతినిధులు, కార్యదర్శితో కలిసి సంయుక్తంగా పరిశీలించాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా సమస్యాత్మకమైన వాటిని గుర్తించి వాటి వివరాలు, తీసుకున్న చర్యల నివేదికను ఇవ్వాలని, రిజర్వాయర్స్‌కు సంబంధించి సమాచారం సేకరించాలని నీటిపారుదల శాఖ ఎస్ఈకి సూచించారు. పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవసరమైన సూచనలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాలతో పాక్షికంగా, పూర్తిగా డామేజ్ అయిన ఇళ్ల వివరాల నివేదికను ఇవ్వాలన్నారు. వారంలోగా వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, కల్వర్టులను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, ఆశాలు, ఏఎన్ఎంల వద్ద అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, 108 వాహనాలను ప్రాధాన్యత పరంగా ఆయా సెంటర్లలో అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్ఓకు సూచించారు. ఎస్పీ రమణ కుమార్ మాట్లాడుతూ, మత్స్యకారులు చేపల వేట కు వెళ్ళవద్దని హెచ్చరించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

సిద్దిపేటరూరల్: మతిస్థిమితం కోల్పోయిన యువకుడు ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన ఉడుత శ్రీనివాస్ (24) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. ఈ క్రమంలో రాఖీ పండగ సందర్భంగా సొంతూరికి వచ్చాడు. కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేని శ్రీనివాస్ సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం గాలించగా పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరాటే పోటీలకు..


కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి కరాటే పోటీలకు గజ్వేల్ మండలం కొడకండ్లలోని ఆల్ఫా ఒమేగా పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ప్రేమ్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎండీ రెహాన్, 5వ తరగతి ఎండీ అఫ్రోజ్ ఈనెల 8, 9, 10, 11 తేదీలలో రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఖేల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కరాటే కోచ్ నరేష్ పాల్గొన్నారు.

రెండో వివాహం చేసుకున్నందుకు జైలు

సదాశివపేట(సంగారెడ్డి): కట్టుకున్న భార్యతో కాపురం చేస్తూనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్న వ్యక్తికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు మహిళ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ మహేశ్‌గౌడ్ తెలిపారు. సదాశివపేట గురునగర్ కాలనీకి చెందిన మీర్జాపూర్ కృష్ణవేణితో జహీరాబాద్ గుల్షన్‌నగర్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి మీర్జాపూర్ జగన్నాథ్‌తో మార్చి 20, 2010న వివాహం జరిగింది. వరకట్నం కింద 15 తులాల బంగారం, 50 తులాల వెండి వస్తువులతో పాటు రూ.5లక్షల నగదు ఇచ్చారు. పెళ్లి అయిన 20 రోజుల నుంచే అత్త సిద్దమ్మ అదనపు కట్నం తీసుకురావాలని కృష్ణవేణిని మానసికంగా వేధించడం మొదలుపెట్టింది. ఆమెకు తోడు ఆడపడుచు భవాని, ఆమె భర్త అంజన్న, మామ రమేష్‌బాబులు తరచూ గొడవపడేవారు. హోతిబి గ్రామంలోని వ్యవసాయ భూమిని కృష్ణవేణి భర్త జగన్నాథ్‌పై చేయించాలని వేధించారు. ఈ సమయంలోనే కృష్ణవేణి గర్భవతి అయ్యి బాబుకు జన్మనిచ్చింది. అయినా భర్త, అత్తమామల్లో మార్పురాలేదు. స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టులో కృష్ణవేణి పిటిషన్ వేసింది. కేసు పెండింగ్‌లోఉండగా కులపెద్దలతో పంచాయతీ నిర్వహించారు. ఇప్పటి నుంచి బాగా చూసుకుంటామని చెప్పడంతో కేసు విత్‌డ్రా చేసుకున్న కృష్ణవేణి కాపురానికి వెళ్లింది. భర్త మద్యంకు అలవాటై ప్రవర్తనలో మార్పు రాలేదు. అనుమానం వచ్చి ఆరా తీయగా.. 2014లో శిరీష అనే అమ్మాయిని జగన్నాథ్ రెండో వివాహం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై నిలదీయగా కృష్ణవేణిని ఇంటి నుంచి వెళ్లగొట్టారు. దీనిపై సంగారెడ్డి మహిళ పోలీస్ స్టేషన్‌లో జూన్ 2017లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. విచారణ జరిపిన సీఐ వెంకటన్న కోర్టుకు నివేదించారు. నేరం రుజువుకావడంతో జగన్నాథ్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి షాలిని షాకెల్లి మంగళవారం తీర్పు చెప్పారని ఎస్‌హెచ్‌ఓ మహేష్‌గౌడ్ తెలిపారు.



- 1,75,719 మంది రైతులకు ప్రయోజనం
- ఇప్పటివరకు రూ.447.23 కోట్ల మాఫీ ప్రక్రియ పూర్తి

గజ్వేల్ : జిల్లాలో పంట రుణాల మాఫీ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి అధికార యంత్రాంగం ముందుకు సాగుతుంది. జిల్లాలోని 175719మంది రైతులకు రూ.1360.49కోట్ల మాఫీ వర్తించింది. ఇప్పటివరకు 83116 మంది రైతులకు చెందిన రూ.447.23కోట్ల మాఫీ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలో కొన్నేళ్లుగా రుణమాఫీ సమస్య కారణంగా పంటరుణాలు సక్రమంగా అందక రైతులు నానా ఇక్కట్లు పడుతూ వస్తున్నారు. మాఫీ వస్తుందనే ఆశతో రుణాలు రెన్యూవల్ చేయకపోవడం వల్ల రైతులకు కొత్త రుణాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో పంట పెట్టుబడుల కోసం అన్నదాతలు ఏటా సీజన్‌లో వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. పంటల దిగుబడి ఆశించినంత రాక, అప్పులు తీరక అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఈ పరిస్థితి వల్ల ఏటా జిల్లాలో రుణవితరణ సక్రమంగా సాగటం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన కొత్త రుణాల లక్ష్యంలో బ్యాంకర్లు 65శాతానికి మించి ఇవ్వడం లేదు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఈ క్రమంలోనే రుణమాఫీ పూర్తిచేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం రైతులకు ఊరటనిస్తుంది. 2014 ఏప్రిల్ 1 నుంచి, 2018 డిసెంబర్ 11వరకు ఉన్న రుణాలను మాఫీ చేయడానికి నిర్ణయించిన సంగతి తెల్సిందే. దీని ప్రకారం జిల్లాలో 175719మంది రైతులకు సంబంధించి రూ.1360.49కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. ఇందులో ఇప్పటివరకు 83116మంది రైతులకు చెందిన రూ.447.23కోట్ల రుణాలను మాఫీ చేసే ప్రక్రియ పూర్తయ్యింది. ఇందులో 75362మంది రైతులకు సంబంధించిన రూ.401.86కోట్ల రుణమాఫీ మొత్తాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన 7754 మందికి చెందిన రూ.45.37కోట్ల రుణమాఫీ మొత్తాన్ని జమ చేయడానికి ఎకౌంట్ క్లోజ్, బ్లాక్, తప్పుడు ఖాతాలు వంటి సమస్యలు ఉండగా, వాటిని సరిచేసే ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.10లక్షల వరకు రుణమాఫీ వర్తింపజేస్తూ రైతులను రుణ విముక్తుల్ని చేస్తున్నారు.

వంద శాతం లక్ష్యం చేరుకునేదెప్పుడు?

జిల్లాలో వర్తించిన రుణమాఫీలో ఇప్పటివరకు 33శాతం వరకు పూర్తిచేసిన అధికారులు వందశాతం లక్ష్యాన్ని చేరుకుంటేనే రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరనుంది. ఇకపోతే ఎకౌంట్ క్లోజ్, బ్లాక్, తప్పుడు ఖాతాలు వంటి సమస్యలతో కొందరు రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదు. బ్యాంకర్ల చుట్టూ తిరిగినా సరైన సమాధానం రాక ఇబ్బందిపడుతున్నా రు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు మాఫీ వర్తిస్తుందా..? లేదా అనే ఆందోళనలో రైతులు ఉన్నారు. గ్రామం యూనిట్‌గా తీసుకొని రుణమాఫీ పూర్తి చేయాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలోకి బ్యాంకర్లు సక్రమంగా వెళ్లక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగాల్సిన అవసరమున్నది.

నిర్దేశించిన గడువులోగా రుణమాఫీ పూర్తి చేస్తాం

ప్రభుత్వం మరో నెల రోజుల్లో వందశాతం రుణమాఫీ పూర్తి చేయాలని ఆదేశాలిచ్చింది. ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగుతున్నాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా బ్యాంకర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. రుణాలు ఇప్పటికే చెల్లించిన రైతులు తమ అకౌంట్లతో రుణమాఫీ మొత్తం పడినట్లుగా మెసేజ్‌లు వస్తే ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్ బుక్ తీసుకెళ్లి బ్యాంకర్ల చూపించి ఆ డబ్బులను డ్రా చేసుకోవచ్చు. – లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్

భార్య మృతికి కారకుడైన భర్తకు ఏడేళ్లు జైలు

సిద్దిపేటకమాన్: వరకట్న వేధింపులకు భార్య ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. తొగుట మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన పోతుల బాబుతో కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన రజితతో 2014 మార్చి, 22న వివాహం జరిగింది. ఆ సమయంలో బంగారం, వెండి, ఇతర కట్న కానుకలు ఇచ్చారు. పెళ్లి అయిన కొన్నిరోజుల తర్వాత అతడు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసి, తర్వాత దుబాయికి వెళ్లి ఒక సంవత్సరం ఉండి వచ్చాడు. తర్వాత అదనపు వరకట్నం కావాలని రజితను శారీరకంగా, మానసికంగా వేధించాడు. పెద్దల సమక్షంలో రాజీ కుదర్చడంతో సిద్దిపేటలో నివాసం ఉన్నారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో రజిత 2017 మార్చి 6న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మృతికి అల్లుడు బాబు కారణమంటూ మృతురాలి తల్లి సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేశారు. అప్పటి ఏసీపీ నర్సింహారెడ్డి కేసు పరిశోధన చేపట్టి నేరస్థుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పూర్తి పరిశోధన అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా అప్పటి నుంచి విచారణ చేసిన అనంతరం జిల్లా ప్రిన్సిపల్ జిల్లా సెషన్ కోర్టు జడ్జి టి.రఘురాం ఇరువురి వాదనలు విన్న తర్వాత బాబుపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు సిద్దిపేట ఏసీపీ తెలిపారు.

సైబర్ వలలో ప్రైవేట్ ఉద్యోగి, గృహిణి

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.13 లక్షలు, ఓ గృహిణి 1.64 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని ఆర్‌ఆర్ హోమ్స్ కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆగస్టు 23వ తేదీన పార్ట్‌టైం జాబ్ పేరిట వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. స్పందించిన ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం 13లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతోపాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు మంగవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన గృహిణికి ఆగస్టు 22వ తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. అందులో ఆమె వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ, ఇచ్చిన టాస్కులు పూర్తి చేసింది. దాంతోపాటు మొత్తం రూ. లక్షా 64 వేలు ఇన్వెస్ట్ చేసింది. చివరికి తాను పెట్టిన డబ్బుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టగొడుగుల్లా బహుళ అంతస్తులు


కొమురవెల్లిలో పర్మిషన్ లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

- కొమురవెల్లిలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు
- జీప్లస్ టూకు పర్మిషన్.. నిర్మాణం జీప్లస్ ఫోర్
- మామూళ్ల మత్తులో గ్రామపంచాయతీ అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో వసతి గదులకు భలే డిమాండ్ ఉంటుంది. దీంతో కొందరు బడా బాబులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలు ఇల్లు నిర్మించుకోవాలంటే సవాలక్ష నిబంధనలు చూపి కొర్రీలు పెట్టే పంచాయతీ అధికారులు బహుళ అంతస్తుల జోలికి పోవట్లేదనే విమర్శలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ పరిధిలో జీ ప్లస్ టూ నిర్మాణానికి మాత్రమే అవకాశం ఉంది. ఎక్కువ అంతస్తుల నిర్మాణం చేపట్టాలంటే డీటీపీసీ నుంచి పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే పంచాయతీ అధికారులు అడ్డగోలుగా జీ ప్లస్ టూకు పర్మిషన్ ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించి కొందరు జీ ప్లస్ ఫోర్ వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రామంలో గతంలో సెట్ బ్యాక్ చేయలేదని సామాన్యురాలి బిల్డింగ్‌ను గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. ఇప్పుడు కొందరు పర్మిషన్ లేకుండా బహుళ అంతస్తులు నిర్మా ణం చేపడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికంగా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి లోకేష్ రెడ్డిని వివరణ కోరగా.. గ్రామ పంచాయతీలో అనేక పనులు ఉన్నా యని , ఎవరైనా రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప చర్యలుండవని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

విచారణ చేపడుతాం

కొమురవెల్లిలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్న విషయం ఇప్పుడే తెలిసింది. రెండు మూడు రోజుల్లో విచారణ చేపటి చర్యలు చేపడుతాం. గ్రామ పంచాయతీల్లో జీ ప్లస్ టూకే పర్మిషన్ ఉంటుంది.

– దేవకీ దేవి, జిల్లా పంచాయతీ అధికారి

గ్రౌండ్ ఇలా.. ఆడేదెలా?


బురదమయమైన ఫుట్‌బాల్ గ్రౌండ్

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ గ్రౌండ్ పరిస్థితి అధ్వానంగా మారింది. ఇదే ఆవరణలో ఆర్‌టీఏ కార్యాలయం ఉండడంతో వివిధ రకాల లైసెన్సులు, అనుమతుల కోసం వచ్చే వాహనాలను ఈ గ్రౌండ్‌లోనే ట్రయల్స్ నిర్వహిస్తుంటారు. దీంతో ఫుట్‌బాల్ గ్రౌండ్ ఆటలు ఆడేందుకు వీలు లేకుండా పోయిందని క్రీడాకారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఈనెల 1 నుంచి 13వ తేదీ వరకు సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ నేషనల్ క్యాంప్(శిక్షణ శిబిరం) కొనసాగుతుంది. వాహనాల ట్రయల్స్‌తో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రౌండ్ పూర్తిగా బురదమయమై చిత్తడిగా మారిందని వాపోయారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి క్రీడాకారులకు అనువుగా ఉండేలా ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

వర్షాలతో వరికి తెగుళ్లు

- సీనియర్ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ శోభ



నర్సాపూర్ రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పంటకు అగ్గి తెగులు, బ్యాక్టీరియా ఎండు తెగులు, ఉల్లి కోడు తెగులు, మోగి పురుగు లేదా సిగపురుగు తెగులు తో పాటు ఆయా రకాల తెగులు సోకే అవకాశం ఉందని నర్సాపూర్ మండలం నత్నయ్యపల్లిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శోభ బుధవారం తెలిపారు. ప్రధానంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా రైతులు మూడు లక్షల ఎకరాలలో వరి సాగు చేస్తున్నట్లు చెప్పారు. భారీగా కురుస్తున్న తెలిపారు. రైతులు యజమాన్య పద్ధతులు పాటిస్తూ పంటను కాపాడుకోవాలని అన్నారు. తెగుళ్ల నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో ఆమె వివరించారు. అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజోల్ ప్లస్ మాన్కోజబ్ కలిపిన మందు 2.5 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటమైసిన్ గ్రాములు 10 లీటర్స్ నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉల్లికోడు నివారణకు పిప్రో నిల్ రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మోగి, సిగ పురుగు నివారణకు క్లోరాంత్రానిలిప్రోల్ గుళికలను నాలుగు కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 కిలోలు ఒక ఎకరానికి చొప్పున వేసుకోవాలి. మెదక్ జిల్లా వ్యాప్తంగా రైతులు నేరుగా అవకాశం లేకుంటే ఫోన్ నంబర్ 9963468360 ద్వారా సంప్రదించి వాట్సాప్, వీడియోల ద్వారా వరికి సోకిన తెగుళ్ల సమస్యకు పరిష్కారం తెలుసుకోవచ్చని శాస్త్రవేత్త శోభ తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని సెలెస్టియల్ హైస్కూల్ (ఇంగ్లిష్) బెస్ట్ టీచర్ షీమాఫర్వీన్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఆర్టీసీ కండక్టర్..


అరిగె సాయిలు (ఫైల్)

హవేళీఘనపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ కండక్టర్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. మండల పరిధిలోని నాగాపూర్ గ్రామానికి చెందిన చాకలి అంజయ్య(50) మెదక్ డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం రాత్రి 12గంటలకు డ్యూటీ ముగించుకొని స్వగ్రామం నాగాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా.. హవేళీఘనపూర్ దాబా వద్ద ఎల్లారెడ్డి నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను మెదక్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని...


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

చేగుంట(తూప్రాన్): ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రెడ్డిపల్లి శివారులోని 44వ జాతీయరహదారిపై మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు తెలవకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రామాయంపేట మార్చురీకి తరలించినట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. మృతుడు 30 నుంచి 35 ఏళ్ల వయసు ఉంటుందని, ఎవరైనా గుర్తిస్తే చేగుంట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

పడుకున్న చోటే వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: మద్యం సేవించి పడుకున్న చోటే ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాలు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌కు చెందిన కేవీఎస్పీఎల్‌ఎన్ ఆచార్య(44) పదిరోజుల క్రితం పటాన్‌చెరు మండలం పోచారం గ్రామ పరిధిలో ఉన్న ఉపేందర్ ఫామ్‌హౌస్‌లో పనికి చేరాడు. ఈ క్రమంలో ఆచార్యకు ఫామ్‌హౌస్ యజమాని ఉపేందర్ సోమవారం ఫోన్ చేయగా తీయలేదు. అనుమానం వచ్చి చూడగా పడుకున్న చోటే ఆచార్య మృతిచెంది కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు తండ్రి జయప్రకాశ్ ఆచార్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలు తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు,లాఅండ్ ఆర్డర్ మల్లారెడ్డి, పాల్గొన్న అధికారులు

సిద్దిపేటకమాన్: ఈనెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో లిస్టు అవుట్ చేసిన కేసుల్లో సంబంధిత కక్షిదారులను పిలిపించి డిస్పోజల్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీలు లాఅండ్ ఆర్డర్ మల్లారెడ్డి, అడ్మిన్ శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం సీఐలు, ఎస్ఐలు, రైటర్లతో రోడ్డు ప్రమాద కేసుల్లో నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ వాహనాల రూల్స్ గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాద కేసులు జరిగినప్పుడు నూతనంగా ప్రవేశపెట్టిన ఫామ్ 1 నుంచి 10వరకు అన్ని వివరాలు పొందుపరిచి, ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి సరైన సమయంలో పంపించాలని సూచించారు. దీంతో రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్ త్వరగా ఎగ్జిగ్యూట్ చేయాలని అన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఇరువురికి సత్వర న్యాయం జరుగుతుందని ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. నూతన టెక్నాలజీ 2.0 వెర్షన్‌లో ఎఫ్ఐఆర్, సీడీఎఫ్, ఇతర అన్ని వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి పోలీసుస్టేషన్‌లో 5ఎస్ ఇంప్లిమెంటేషన్ పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాద కేసుల్లో నూతన మోటార్ వాహనాల నిబంధనల గురించి ట్రాఫిక్ పోలీసు అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ తిరుపతి, వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్, త్రీ టౌన్ సీఐ భానుప్రకాష్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.